సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 31 । జనవరి । 2025



ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఆరోపించారు.

- 8లో ▸



చదువులకు దూరంగా..

పలు గ్రామాలలో అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందడం లేదు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.4 /15.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రాఘవపల్లికి హైకోర్టు జడ్జి రాక



నాగిరెడ్డిపేట : రాఘవపల్లి గ్రామానికి గురువారం హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేనారెడ్డి వచ్చారు. తన కూతురు వివాహ వేడుకల్లో భాగంగా రాఘవపల్లిలో పోచమ్మ పండుగ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్, స్థానిక ఎస్సై మల్లారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు న్యాయమూర్తికి గౌరవ వందనం సమర్పించారు. ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక, ఆర్డీవో మన్నె ప్రభాకర్, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావుతోపాటు పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'మీడియేషన్ సెంటర్లు ప్రారంభించాలి'



కామారెడ్డి టౌన్: మీడియేషన్ సెంటర్లను ప్రారంభించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి నాగరాణి సూచించారు. గురువారం కోర్టు భవనంలో కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీడియేషన్ సెంటర్లలో సామరస్యంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. కేసులను ఎలా పరిష్కరించాలో సవివరంగా వివరించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. డబ్బు, సమయం వృథా చేసుకోకుండా ఇరువర్గాలకు అవగాహన కల్పించి సమస్యను పరిష్కరించాలన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించిన వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో వలంటీర్లు ప్రతాప్‌రెడ్డి, విజయ్ కుమార్, నరేష్, అలీ మొహ్దీన్, బాబుమియా, సురేష్, స్వప్న, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

'1912 నంబర్‌కు సమాచారమివ్వండి'

కామారెడ్డి అర్బన్: విద్యుత్ సమస్యలుంటే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆ శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద లోపాలు, లో ఓల్టేజీ, బ్రేక్‌డౌన్‌లు, ప్రమాదకర స్తంభాలు, వేలాడుతున్న వైర్లు, బిల్లుల్లో తేడాలు, మీటర్ సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ (1912) 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

'యోగా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి'

కామారెడ్డి అర్బన్ : ఆరోగ్యం కోసం యోగా, ధ్యాన్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్ సూచించారు. ఆరోగ్య భారత్‌లో భాగంగా ప్రభుత్వం జిల్లాలోని 16 ఆయుష్ వైద్యశాలలకు మహిళా, పురుష యోగా శిక్షకులను వేర్వేరుగా నియమించిందని పేర్కొన్నారు. యోగా, ధ్యాన కేంద్రాలు రోజూ ఉదయం 6.30 గంటల నుంచి గంటపాటు తెరిచి ఉంటాయని తెలిపారు.

'మద్యం సేవించి వాహనాలు నడపొద్దు'



కామారెడ్డి రూరల్: రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపడమేనని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం క్యాసంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం ఏమిటన్న ప్రశ్నకు సమాధానం చెప్పిన సాయి, సన్ని అనే విద్యార్థులకు హెల్మెట్ బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



- దశాబ్దాలుగా పెండింగ్‌లోనే రైల్వే ప్రాజెక్టులు
- విస్తరణకు నోచుకోని కేకేవై రోడ్డు
- జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేక ఇబ్బందులు
- రేపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలమ్మ

కేంద్రం కరుణించేనా..?

కేంద్ర బడ్జెట్‌పై జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు ఈసారైనా నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నారు. కరీంనగర్ – కామారెడ్డి – ఎల్లారెడ్డి జాతీయ రహదారి విస్తరణ చేపట్టాలని, జిల్లాలో కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలని కోరుతున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈసారైనా జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులపై దృష్టి సారిస్తారన్న ఆశతో జిల్లావాసులున్నారు. ప్రధానంగా రైల్వే ప్రాజెక్టులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన సికింద్రాబాద్ -కామారెడ్డి -నిజామాబాద్ -ముథ్కేడ్ రూట్‌లో డబ్లింగ్ పనులు అసంపూర్తిగా మిగిలాయి. సికింద్రాబాద్ నుంచి ముథ్కేడ్ దాకా రైల్వేలైన్ 249 కి.మీ. విస్తరించి ఉంది. రాష్ట్ర రాజధాని నుంచి దేశ వాణిజ్య రాజధాని అయిన ముంబయికి ఈ మార్గం దగ్గరగా ఉంటుంది. ఈ మార్గంలో రోజూ దేవగిరి ఎక్స్‌ప్రెస్ వెళ్తుంది. ఈ లైన్‌పై నిత్యం 60 వరకు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుగుతుంటాయి. అలాగే రవాణా రైళ్లు కూడా పెద్ద సంఖ్యలోనే నడుస్తుంటాయి. ఈ మార్గంలో బాసర సరస్వతి మాత ఆలయం, నాందేడ్ గురుద్వారా, షిరిడీ సాయిబాబా ఆలయాలున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో రద్దీ ఎక్కువగానే ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే రైళ్ల సంఖ్యను పెంచినా డబుల్ లైన్ లేకపోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. డబ్లింగ్ పనుల పూర్తికి నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

బీబీబీ రైల్వేలైనుకు మోక్షమెప్పుడో?

వెనకబడిన ప్రాంతమైన బాన్సువాడ, జుక్కల్ ని యోజక వర్గాలకు రైల్వే సదుపాయం కల్పించేందు కు బోధన్ నుంచి బాన్సువాడ మీదుగా కర్ణాటక రా ష్ట్రంలోని బీదర్ దాకా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. బోధన్ – బీదర్ మధ్య దూరం సుమారు 140 కిలోమీటర్లు ఉంటుంది. ఈ లైన్ మంజూరు చేయిస్తామని ప్రతి ఎన్నికలలో నేతలు హామీ ఇస్తుంటారు. బడ్జెట్ సమయంలో నిధుల కోసం వినతులు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారు. రైల్వేలైన్ చేపట్టేందుకు గతంలో సర్వేలు చేసినా నిధులు రాకపోవడంతో పనులు మొదలు కాలేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా ఈ లైన్ ప్రస్తావన ఉంటుందేమోనని ప్రజలు ఆశతో ఉన్నారు.

కేకేవై రోడ్డుకు నిధులొచ్చేనా?

కరీంనగర్ నుంచి సిరిసిల్ల, కామారెడ్డి మీదుగా ఎల్లారెడ్డి వరకు ఉన్న కేకేవై రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించినప్పటికీ రోడ్డు విస్తరణకు నిధులు ఇవ్వలేదు. ఈ మార్గంలో వాహనాల రద్దీ గణనీయంగా పెరిగింది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం ఎక్కడోచోట ప్రమాదం జరుగుతోంది. రోడ్డును విస్తరిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.


అలాగే జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో పంట ఉత్పత్తులను నిల్వ చేయడం సమస్యగా మారింది. కేంద్ర ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలతో పాటు భారీ గోదాంల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రత్యేక కోర్సులతో ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం విద్యారంగంలో అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నారు.

రైల్వే వంతెనలు లేక ఇబ్బందులు

కామారెడ్డి పట్టణాన్ని రైల్వేలైన్ రెండుగా చీలుస్తుంది. పట్టణంలో రాకపోకల కోసం రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇరుకు వంతెన ఒక్కటే ఉంది. అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో నిత్యం రైళ్లు వచ్చినప్పుడల్లా ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు వెళ్లేందుకు ఇదే ప్రధానదారి కావడంతో వందలాది వాహనాలు రైల్వే గేట్ మీదుగానే వెళ్తాయి. గంటకు మూడునాలుగుసార్లు రైల్వే గేటు పడుతుండడంతో ఈ మార్గంలో వెళ్లే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కసాబ్ గల్లీ ప్రాంతంలో మరో రైల్వే వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది.

మాఘమాసం.. మంచి ముహూర్తం

- 2 నుంచి వరుసగా శుభకార్యాలు
- వేల సంఖ్యలో జరగనున్న వివాహాలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఏటా మాఘమాసం శుభ ముహూర్తాలను మోసుకొని వస్తుంది. ఈసారి కూడా మంచి ముహూర్తాలు ఉండడంతో వివాహాలు పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. ఇప్పటికే పెళ్లి సంబంధాలు మాట్లాడుకుని ముహూర్తాలు నిర్ణయించుకున్నవారు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మాఘమాసంలో ఫిబ్రవరిలో 2, 3, 7, 8, 13, 16, 20, 23 తేదీలతోపాటు మార్చి 2, 6 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వేద పండితుడు జయరాం శర్మ 'సాక్షి'తో తెలిపారు. శుభ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లతో పాటు నూతన గృహ ప్రవేశాలు పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. ఈ మాసంలో జిల్లాలో వేలాది వివాహాలు జరుగుతాయని భావిస్తున్నారు. ముందుగానే పెళ్లి సంబంధాలు ఖాయం చేసుకున్నవారు ఇప్పటికే ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్, మేళతాళాలు, ఫొటో, వీడియోగ్రాఫర్లను మాట్లాడి పెట్టుకున్నారు. పెళ్లిళ్లకు సమయం దగ్గర పడుతుండడంతో వస్త్రాలు, బంగారం, ఫర్నిచర్, వంట పాత్రలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి.

కష్టపడ్డ వారికే పదవులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- అవినీతికి దూరంగా ఉండాలి
- సీడీసీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్: పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మర్కల్ స్టేజీ వద్దనున్న అశోక్ గార్డెన్స్‌లో సీడీసీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపుకోసం కృషి చేసిన అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ ఇర్షాదొద్దీన్‌కు సీడీసీ చైర్మన్ పదవి కట్టబెట్టామన్నారు. అవినీతికి దూరంగా ఉంటూ ప్రజా సేవే ధ్యేయంగా సాగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పదవులను కైవసం చేసుకునే లక్ష్యంతో సాగాలన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని గతంలో అసెంబ్లీ సమావేశాల్లో తాను గళం విప్పడం వల్లే ప్రస్తుతం రాష్ట్రమంతా పట్టాలిస్తున్నారన్నారు. త్వరలో లింగంపల్లి శివారులో వివిధ రకాల ఫ్యాక్టరీలు ఏర్పాటు కానున్నాయన్నారు. భూంపల్లి శివారులో ప్రాణహిత చేవెళ్ల 22వ ప్యాకేజీ పనులు త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మండల పరిధిలో సీడీసీ కార్యాలయం కోసం భవనాన్ని నిర్మించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్, విండో చైర్మన్లు సదాశివరెడ్డి, గంగాధర్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రూపేందర్ రెడ్డి, బాగయ్య, మహేందర్‌రెడ్డి, శ్యాంరావ్, బీరయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వీరులకు ఘన నివాళి

కామారెడ్డి క్రైం : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను స్మరించుకుంటూ గురువారం అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. కలెక్టరేట్‌లో గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని గాంధీజీతోపాటు స్వాతంత్య్ర ఉద్యమంలో అమరులైనవారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

దేశ స్వాతంత్య్ర పోరాటంలో అమరులైన వారికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎండీఎం ఏజెన్సీ తొలగింపు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) ఏజెన్సీని తొలగించినట్లు అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బియ్యం, వంట సామగ్రిని ఆయన పరిశీలించారు. అనంతరం ఫుడ్ పాయిజన్ కావడంతో అనారోగ్యానికి గురైన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లతో మాట్లాడి ఫుడ్ పాయిజన్ కావడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఎండీఎం ఏజెన్సీ తప్పిదం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తేలడంతో వెంటనే ఎండీఎం ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ఎంఈవో వెంకటేశంను ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో బలరాం, ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష, ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై వేటు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారని ఇన్‌చార్జి డీఈవో బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషయంలో హెచ్‌ఎం సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్లే 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని భావిస్తూ విచారణ అనంతరం ఈ చర్య తీసుకున్నారని పేర్కొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బల్దియా ప్రత్యేకాధికారిగా..

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాల విభజన!

- కొత్త మండలాల ఏర్పాటుతో నిర్ణయం
- డ్రాఫ్ట్ విడుదల చేసిన జెడ్పీ అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఎంపీటీసీ స్థానాల స్వరూపం మారనుంది. పలు మండలాల్లో ఎంపీటీసీ స్థానాలు, వాటి పరిధిలోని గ్రామాలతో రూపొందించిన ప్రతిపాదనలకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను జిల్లా పరిషత్ అధికారులు విడుదల చేశారు. కొత్త మండలాల ఏర్పాటు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల నిజాంసాగర్ మండలం నుంచి మహ్మద్‌నగర్, మద్నూర్ నుంచి డోంగ్లీ, మాచారెడ్డి నుంచి పాల్వంచ మండలాలు ఏర్పాటైన విషయం తెలిసిందే. అలాగే బీబీపేట, దోమకొండ, రామారెడ్డి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో కొన్ని మార్పులు జరిగాయి. దీంతో ఆయా మండలాల్లో ఎంపీటీసీ స్థానాల వివరాలతో డ్రాఫ్ట్‌ను విడుదల చేశారు.

■ రామారెడ్డి మండల జనాభా 34,726. జనాభాకు అనుగుణంగా పది ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. రామారెడ్డి గ్రామం రామారెడ్డి–1, రామారెడ్డి–2 ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఉంది. అన్నారం ఎంపీటీసీ స్థానం పరిధిలో పరిధిలో అన్నారం, గొడుగుమర్రి తండా, గిద్దలో గిద్ద, గోకుల్‌తండా, ఇసన్నపల్లిలో ఇసన్నపల్లి, కన్నాపూర్, కన్నాపూర్ తండా, మద్దికుంటలో మద్దికుంట, పోసానిపేట ఎంపీటీసీ స్థానం పరిధిలో పోసానిపేట, రంగంపేట గ్రామాలున్నాయి. రెడ్డిపేటలో రెడ్డిపేట, స్కూల్ తండాలో స్కూల్ తండా, జగదాంబతండా, బట్టుతండా, ఉప్పల్‌వాయిలో మోషంపూర్, ఉప్పల్‌వాయి గ్రామాలున్నాయి.



మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు, వాటి పరిధిలోని గ్రామాల వివరాలు :

■ బీబీపేట మండల జనాభా 26,749 కాగా.. ఎనిమిది ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. బీబీపేట మండల కేంద్రంలో బీబీపేట–1, బీబీపేట–2, బీబీపేట–3 ఎంపీటీసీ స్థానాలుండగా.. జనగామ గ్రామం ఒకటి ఎంపీటీసీ స్థానంగా, మాందాపూర్ ఒక స్థానంగా, ఇస్సానగర్‌లో ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, తుజాల్‌పూర్‌లో సేరిబీబీపేట, మల్కాపూర్, తుజాల్‌పూర్ గ్రామాలు, యాడారం ఎంపీటీసీ స్థానంలో కోనాపూర్, యాడారం, శివార్‌రాంరెడ్డిపల్లి గ్రామాలు ఉన్నాయి.

■ పాల్వంచ మండల జనాభా 21,466 కాగా.. ఆరు ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. పాల్వంచ గ్రామం ఒక ఎంపీటీసీ స్థానంగా ప్రతిపాదించగా.. ఆరెపల్లి ఎంపీటీసీ పరిధిలో ఆరెపల్లి, పోతారం, సింగరాయపల్లి గ్రామాలు, భవానీపేట స్థానంలో భవానీపేట, భవానీపేట తండా, ఫరీదుపేట స్థానంలో ఫరీదుపేట, బండరామేశ్వర్‌పల్లి, ఇసాయిపేటలో ఇసాయిపేట, ఎల్పుగొండ స్థానంలో ఎల్పుగొండ, వాడి, దేవునిపల్లి గ్రామాలను ప్రతిపాదించారు.

■ డోంగ్లీ మండలంలో 18,730 మంది ఉండగా ఐదు ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. లింబూర్ స్థానంలో లింబూర్, హసన్ టాక్లీ గ్రామాలు, మొగా గ్రామంలో మొగా, మల్లాపూర్, మారెపల్లి, ధోతి, డోంగ్లీ స్థానంలో డోంగ్లీ, ఎలేగావ్, మదన్ హిప్పర్గలో మదన్ హిప్పర్గ, ఎంబుర, కుర్ల, సిర్పూర్ ఎంపీటీసీ పరిధిలో సిర్పూర్, పెద్ద టాక్లీ గ్రామాలుంటాయి.

■ మాచారెడ్డి మండలంలో 23,760 మంది ఉండగా.. ఏడు ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. అక్కాపూర్ ఎంపీటీసీ స్థానం పరిధిలో అక్కాపూర్, గన్‌పూర్(ఎం), కాకులగుట్ట తండా, నడిమితండా స్థానంలో నడిమితండా, ఎల్లంపేట, బోడిగుట్ట తండా, ఒడ్డెరగూడెం తండా, గుంటి తండా, అంకిరెడ్డిపల్లి తండా, వెనుకతండా, మైసమ్మ చెరువు తండా లు, చుక్కాపూర్ స్థానంలో చుక్కాపూర్, లక్ష్మీరావులపల్లి గ్రామాలు, గజ్యానాయక్‌తండాలో గజ్యానాయక్ తండా, కొత్తపల్లి, రాజఖాన్‌పేట గ్రామాలు, లచ్చాపేటలో లచ్చాపేట గ్రామం, మాచారెడ్డి స్థానంలో మాచారెడ్డి గ్రామం, రత్నగిరిపల్లి స్థానంలో రత్నగిరిపల్లి, సోమారంపేట, బంజెపల్లి, సర్దాపూర్‌తండా, నెమలిగుట్టతండా, మర్రితండా, సోమారంపేట తండాలు ఉంటాయి.

■ దోమకొండ మండల జనాభా 30,190. ఇక్కడ తొమ్మిది ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. దోమకొండ మండల కేంద్రంలో దోమకొండ–1, దోమకొండ–2, దోమకొండ–3, దోమకొండ–4 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అంబారీపేట, సంగమేశ్వర్ వేరువేరు ఎంపీటీసీ స్థానాలుగా కొనసాగనున్నాయి. అంచనూర్ స్థానంలో అంచనూర్, సీతారాంపల్లి గ్రామాలు, ముత్యంపేట స్థానంలో ముత్యంపేట, చింతమానుపల్లి, గొట్టిముక్కుల ఎంపీటీసీ పరిధిలో గొట్టిముక్కుల, లింగుపల్లి గ్రామాలను ప్రతిపాదించారు.

■ పెద్దకొడప్‌గల్ మండల జనాభా 22,653. ఇక్కడ ఏడు ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. పెద్దకొడప్‌గల్, బాబుల్‌గావ్ గ్రామాలను వేరువేరు ఎంపీటీసీ స్థానాలుగా ప్రతిపాదించగా.. కాటెపల్లి ఎంపీటీసీ స్థానం పరిధిలో కాటేపల్లి, కాటేపల్లి తండా, చిన్నతక్కడ్‌పల్లిలో చిన్నతక్కడ్‌పల్లి, శివాపూర్, తలాబు తండా, చవిని తండా, జగన్నాథపల్లి గ్రామాలు, పోచారం స్థానంలో పోచారం, పోచారం తండా, విఠల్‌వాడీ, విఠల్‌వాడీ తండా, లింగంపల్లిలు, పెద్ద దేవిసింగ్ తండా స్థానంలో పెద్ద దేవిసింగ్ తండా, చిన్న దేవిసింగ్ తండా, అంజని, బురుగుపల్లి, టికారాంతండా, సుముందర్ తండా, కాస్లాబాద్ స్థానంలో కాస్లాబాద్, కుబ్యానాయక్ తండా, బేగంపూర్, వడ్లం గ్రామాలున్నాయి.

■ మహ్మద్‌నగర్ మండల జనాభా 17,909. ఇక్కడ ఐదు ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. దూప్‌సింగ్ తండా స్థానంలో దూప్‌సింగ్‌తండా, గిర్నితండా, మక్దుంపూర్ గ్రామాలు, కోమలంచ స్థానంలో కోమలంచ, గాలిపూర్, తునికిపల్లి స్థానంలో తునికిపల్లి, గున్కుల్, బూర్గుల్, మహ్మద్‌నగర్ స్థానంలో మహ్మద్‌నగర్, నర్వ, హసన్‌పల్లి, సింగితం ఎంపీటీసీ స్థానం పరిధిలో సింగితం, తెల్గాపూర్ గ్రామాలను ప్రతిపాదించారు.

■ నిజాంసాగర్ మండలంలో 19,004 మంది ఉండగా.. ఐదు ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. మల్లూర్ ఎంపీటీసీ స్థానంలో మల్లూర్, మల్లూర్ తండా, జక్కాపూర్ గ్రామాలు, వెల్గనూర్ స్థానంలో వెల్గనూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, మంగ్లూర్, బ్రాహ్మణపల్లి, అచ్చంపేట స్థానంలో అచ్చంపేట, ఆరెపల్లి గ్రామాలు, బంజెపల్లి స్థానంలో బంజెపల్లి, సుల్తాన్‌నగర్, వడ్డెపల్లి స్థానంలో వడ్డెపల్లి, మాగి, గోర్గల్ గ్రామాలున్నాయి.

■ మద్నూర్ మండల జనాభా 40,272. ఈ మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలను ప్రతిపాదించారు. మద్నూర్ మండల కేంద్రంలో మద్నూర్–1, మద్నూర్–2 ఎంపీటీసీ స్థానాలతోపాటు మద్నూర్‌లోని కొంత ప్రాంతంతోపాటు తడిహిప్పర్గ కలిపి మద్నూర్–3లో చేర్చారు. హండేకల్లూర్ ఎంపీటీసీ స్థానం పరిధిలో హండేకల్లూర్, చిన్న శక్కర్గ గ్రామాలు, పెద్ద తడ్గూర్ స్థానంలో పెద్ద తడ్గూర్, చిన్న తడ్గూర్ గ్రామాలు, కొచ్చెరలో కొచ్చెర, చిన్న ఎక్లారా, ధన్నూర్‌లో ధన్నూర్, సోమూర్, అంతాపూర్, పెద్ద ఎక్లారాలో పెద్ద ఎక్లారా, రాచూర్, లచ్చన్‌లో లచ్చన్, శేఖాపూర్ గ్రామాలు, సుల్తాన్‌పేట్‌లో సుల్తాన్‌పేట, రుసేగావ్, మేనూర్‌లో మేనూర్, ఆవల్‌గావ్, పెద్ద శక్కర్గ ఎంపీటీసీ పరిధిలో పెద్ద శక్కర్గ, గోజేగావ్ గ్రామాలున్నాయి.

క్లుప్తంగా

పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి



కామారెడ్డి క్రైం: ఆయా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతపై ప్రజలకు వివరించాలన్నారు. వీలైనన్ని ఎక్కువ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లోని ప్రతిభకు గుర్తింపు



భిక్కనూరు: సైన్స్ ఫెయిర్లతో విద్యార్థుల్లోని ప్రతిభకు గుర్తింపు వస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటే భవిష్యత్తులో వారు ప్రపంచానికి ఉపయోగపడే ప్రయోగాలను తయారుచేసేవారుగా రూపొందుతారన్నారు. పాఠశాలలో 127 మంది విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. అనంతరం చైతన్య విద్యానికేతన్ యాజమాన్యం 1,100 మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. నేతలు ఇంద్రకరణ్ రెడ్డి, బీంరెడ్డి, నంద రమేష్, గంగళ్ల రవీందర్, నర్సింహారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్, హెచ్‌ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(భాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లిలో బుధవారం ప్రారంభమైన అల్లమా ప్రభు జాతరలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జాతర సందర్భంగా నేడు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో గురువారం అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తన్నీరు శేఖర్ దంపతుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, గోపాల్‌రావు, సాయాగౌడ్, కుసుమ రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక అవస్థలు

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు నెలలుగా అందని జీతం
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపుపై స్పష్టత కరువు



వేతనాల కోసం డీఈవోను కలిసిన సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు (ఫైల్)

ఆర్మూర్: సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండు నెలలుగా వేతనాలు అందక ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 29 రోజుల పాటు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఉద్యోగులు సైతం పాల్గొన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర జేఏసీ నాయకత్వంలో కొందరు చేసిన తప్పిదం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకున్నప్పటికీ సమ్మెను విరమించారు. అయితే సమ్మె విరమించే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదు కాబట్టి కాంట్రాక్టు ఉద్యోగులకు పే స్కేల్ వర్తింప జేయాలి అనే డిమాండ్‌ను పక్కన పెట్టి నాన్ ఫైనాన్షియల్ డిమాండ్లన్నింటిని పరిష్కరిస్తూ సమ్మె కాలానికి వేతనం సైతం చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారంటూ జేఏసీ నాయకత్వం సమ్మెను విరమింపజేసింది. డిసెంబర్ 7వ తేదీ నుంచి నిరసన దీక్షలు ప్రారంభించిన ఉద్యోగులు పదో తేదీ నుంచి పూర్తి స్థాయిలో విధులను బహిష్కరిస్తూ సమ్మె బాట పట్టారు. అయితే సమ్మె కారణంగా డిసెంబర్ నెల వేతనం పొందలేకపోయారు. జనవరి 6వ తేదీ నుంచి విధుల్లో చేరినప్పటికీ జనవరి నెల వేతనం సైతం అందే పరిస్థితులు లేవు. సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులను కలుస్తూ సమ్మె డిమాండ్ల సాధనతో పాటు సమ్మె కాలంలో వేతనం చెల్లింపుకు ఉత్తర్వులు జారీ చేయాలని విన్నవిస్తున్నా అధికారుల్లో కదలిక లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలి



చాలీచాలని వేతనాలతో ఇక్కట్లు పడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామన్న అధికారులు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలి. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేశారు అనే భావన సరైంది కాదు. న్యాయమైన మా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి సమ్మె చేశాం.

– రాజు, సమగ్ర శిక్ష జేఏసీ అధ్యక్షుడు, నిజామాబాద్

ప్రతిసారి మోసపోతూనే ఉన్నాం



ఎన్నికలకు ముందు, తరువాత రాజకీయ నాయకులు, పాలకుల హామీలను నమ్మి ప్రతి సారి మోసపోతూనే ఉన్నాం. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలం వేతనాలతో పాటు పే స్కేల్ ఇచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ప్రకాశ్, సమగ్ర శిక్ష జేఏసీ నాయకుడు, నిజామాబాద్

ఉమ్మడి జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగుల వివరాలు

విభాగం	నిజామాబాద్	కామారెడ్డి
కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది	571	480
యూఆర్‌ఎస్, బోధనేతర సిబ్బంది	10	10
డీపీవో సిబ్బంది	9	7
ఎంఐఎస్ సమన్వయకర్తలు	22	22
సీసీవోలు	29	22
సీఆర్పీలు	94	76
ఐఈఆర్పీలు	35	26
మెసెంజర్లు	19	18
పీటీఐలు	88	71
సీజీవీలు	19	18
మొత్తం	896	750

టీజీబీ ప్రభుత్వ రంగ బ్యాంకే

బ్యాంకు జనరల్ మేనేజర్ అనిల్



రుణాల చెక్కులను అందిస్తున్న జీఎం

గాంధారి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు వంద శాతం ప్రభుత్వ రంగ బ్యాంకే అని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ వి.అనిల్ పేర్కొన్నారు. బ్యాంకును గురువారం నూతన భవనంలోకి మార్చారు. ఆయన నిజామాబాద్ రీజనల్ మేనేజర్ నవీన్ కుమార్‌తో కలిసి నూతన భవనంలో కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 35 శాతం ఎస్‌బీఐ వాటా కలిగి ఉన్నాయన్నారు. మహిళా సంఘాలకు ఎక్కువగా రుణాలు అందించే బ్యాంకుగా నిలిచామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ పరిధిలోని 289 మహిళా సంఘాలకు సంబంధించిన రూ.35 కోట్ల రుణాల చెక్కులను, ఒక కార్ లోన్ చెక్కును, రూ.60 లక్షల విలువైన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం రుణాలను పంపిణీ చేశారు. పీఎం జీవన జ్యోతి బీమా కింద రూ.2 లక్షల చొప్పున ముగ్గురికి, ఒకరికి ప్రమాదబీమా కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కును అందించారు. ఐకేపీ డీపీఎం రవీందర్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, టీజీబీ ఎస్‌ఎంవో అజయ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్న మరణం తట్టుకోలేక ఆగిన తమ్ముడి గుండె



అంజల్‌రెడ్డి(ఫైల్)

మాచారెడ్డి: అన్న మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో తమ్ముడు మృతి చెందాడు. ఈ ఘటన మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్కాపురం నరసింహారెడ్డి(75) అనారోగ్యానికి గురై మూడు రోజుల క్రితం మృతి చెందాడు. నర్సింహారెడ్డి మరణాన్ని తట్టుకోలేక ఆయన తమ్ముడు అంజల్ రెడ్డి(65) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు.

అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- గాంధీ విగ్రహానికి వినతి పత్రం



బిచ్కుందలో వినతి పత్రం అందిస్తున్న సింధే

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతోందని, అసమర్థ ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని మహాత్ముడిని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే వేడుకున్నారు. గురువారం బిచ్కుందలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి 420 రోజులు అవుతుందని, మోసపూరిత వాగ్దానాలతో సీఎం ప్రజలను ప్రతినిత్యం వంచిస్తున్నారని విమర్శించారు. అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని, ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నాయకులు నాల్చర్ రాజు, వెంకట్‌రావు, యాదవరావు, హన్మాండ్లు, ముఖీద్, పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



సూచనలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆయా మండలాల అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు శుక్రవారం మండల కేంద్రాల్లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో నీటి సరఫరా పరిస్థితిని అంచనా వేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి సమస్యలను గుర్తించాలన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల కోసం ప్రణాళిక రూపొందించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలు తమ ప్రాంతంలో నెలకొన్న నీటి సమస్యలను టోల్‌ఫ్రీ నెంబర్ 18005994007 ద్వారా తెలపవచ్చని సూచించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీపీవో శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాలకు వినతులు



జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ :కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, పథకాల అమలుకు సీఎం రేవంత్ రెడ్డి రోజుకో మాట చెబుతున్నారని ఆరోపిస్తూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. స్థానికంగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అలవికాని హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. 420 హామీలు 420 రోజులు గడిచినా ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ధ్వజమెత్తారు.



బాన్సువాడలో ..



రామారెడ్డిలో ..



తిమ్మాజీవాడిలో ..



ఎల్లారెడ్డిలో ..

క్రైం కార్నర్

లారీ ఢీకొని బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ మృతి



కల్యాణ్‌కుమార్(ఫైల్)

డిచ్‌పల్లి: లారీ ఢీకొనడంతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మాధవనగర్ బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. నిజామాబాద్ రూరల్ ఎస్సై ఎండీ ఆరీఫ్, బెటాలియన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా కల్యాణ్‌కుమార్ (29) డిచ్‌పల్లిలోని బెటాలియన్‌లో 2018 నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉంటూ రోజూ విధి నిర్వహణ కోసం బెటాలియన్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి తన బైక్‌పై నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లిలోని బెటాలియన్‌కు బయలుదేరాడు. మాధవనగర్ బైపాస్ రోడ్డులో వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో కల్యాణ్‌కుమార్ తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుష్మ, మూడు సంవత్సరాల పాప, రెండు నెలల బాబు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామని బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ తెలిపారు. గురువారం పోస్టుమార్టం అనంతరం కల్యాణ్‌కుమార్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో బెటాలియన్ కు తీసుకువచ్చారు. ఆయన పార్థివ దేహానికి బెటాలియన్ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.

గంజాయి పట్టివేత



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ చౌరస్తాలో గురువారం మధ్యాహ్నం గంజాయి పట్టుకున్నట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేసి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండ మండలం లింగట్ల గ్రామానికి చెందిన రంజిత్‌సింగ్, బరదవత్ గవాస్కర్ బైక్‌పై ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 1.3 కేజీల గంజాయి, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తనిఖీల్లో ఎస్సై చంద్రమౌళి, సిబ్బంది సాయిలు, వికాస్‌గౌడ్, సందీప్, నరేష్, శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.

టేకు దుంగలు..



సిరికొండ : సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని చీమన్‌పల్లి, జనిగ్యాల గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 74 టేకు దుంగలను పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో రవీందర్ గురువారం తెలిపారు. జనిగ్యాల గ్రామంలో బన్నీ నాయక్ చీమనుపల్లి గ్రామంలో వడ్రంగి నరేష్, మాలావత్ విజయ ఇళ్ల సమీపంలో టేకు కర్రలు పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.78 వేల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దుంగలను సిరికొండలోని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం



మేదరి శివయ్య, గాండ్ల సాయిలు

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో గురువారం ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన మేదరి శివయ్య (55) 2024 మే నుంచి కనబడడం లేదని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన శివయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే బాన్సువాడ డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన గాండ్ల సాయిలు (45) 2024 జూలైలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్టు షాపుపై దాడి

లింగంపేట: లింగంపేటలోని అంబేడ్కర్ చౌరస్తా ప్రాంతంలో సోమాగౌడ్ నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఎక్సైజ్ సీఐ షాకిర్ గురువారం దాడి చేశారు. సోమాగౌడ్‌ను బైండోవర్ చేశామన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో మిర్యాల పోసాని (50) అలియాజ్ స్వప్న అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వర్ని మండలం ఉమ్మనాపూర్ గ్రామానికి చెందిన రాజారాం, మిర్యాల పోసాని కుటుంబ 25 ఏళ్ల క్రితం ఉపాధి కోసం ఆర్మూర్ పట్టణానికి వలస వచ్చారు. రాజారాం 12 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా స్వప్న ఐదేళ్లుగా మహబూబ్ అనే వ్యక్తితో గోవింద్‌పేట్ గ్రామంలో సహజీవనం చేస్తోంది. ఇద్దరు కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఐదు రోజుల నుంచి వీరు ఉంటున్న ఇంటికి తాళం ఉంది. కాగా బుధవారం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గురువారం పోలీసులు క్లూస్‌టీంతో కలిసి ఇంట్లోకి వెళ్లగా కుళ్లిపోయిన స్థితిలో స్వప్న మృతదేహం కనిపించింది. వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, గోవింద్‌పేట్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

నగరంలో వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని సీతారాంనగర్ కు చెందిన అవుసుల అంజయ్య(60) మృతి చెందినట్లు ఐదో టౌన్ ఎస్సై లక్ష్మయ్య గురువారం తెలిపారు. అంజయ్యకు కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేదన్నారు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. గురువారం మృతి చెందారని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కామారెడ్డిలో గుర్తు తెలియని మహిళ..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ గురువారం మృతి చెందింది. 50–55 ఏళ్ల వయస్సు గల ఆమె గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గద్దెపై పడుకున్న చోటనే ఆమె మృతి చెందగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ..



రజిత(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన రజిత (39) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. వివరాలు.. ఈ నెల 25న ముగురి శ్రీనివాస్ తన భార్య రజితతో కలిసి బైక్‌పై లింగంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రజితను మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం : ఒకరిపై కేసు



స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ వద్ద బుధవారం రాత్రి పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన నర్సగొండ మడిగె నిర్మాణం చేపట్టేందుకు రాళ్లు అడ్డుగా ఉండడంతో వాటిని పేల్చడానికి పేలుడు పదార్థాలు తీసుకొచ్చాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 40 జిలిటెన్ స్టిక్స్, స్టిక్స్ పొడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నర్సగొండపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



భూమేశ్వర్(ఫైల్)

బాల్కొండ:ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన పెంటు భూమేశ్వర్(57) ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు.వివరాలు.. భూమేశ్వర్ గ్రామంలో కిరాణ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన భూమేశ్వర్ కిరాణ షాపు వెనుక గదిలో ఉరి వేసుకున్నాడు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు..



సాయిలు(ఫైల్)

రెంజల్: అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్సై బాబురావు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కండెపల్లి సాయిలు (64) కొంతకాలంగా నరాల నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తాడ్‌బిలోలి శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: దైవ దర్శనానికని వెళ్లిన ఓ కుటుంబం తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గురువారం వెలుగుచూసింది. కాలనీకి చెందిన రాజశేఖర్ రెడ్డి కుటుంబం బుధవారం మాఘ అమావాస్య కావడంతో పుణ్యస్నానం చేయడానికని ఇంటికి తాళం వేసి కూడెల్లి వాగుకు వెళ్లారు. గురువారం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దొంగలు చొరబడి సామాన్లన్నీ చిందరవందర చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. ఇంట్లో దాచి ఉంచిన రూ.30 వేలు నగదు, 3 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామం శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి పంట చేను వద్ద కట్టేసిన లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగారం రోడ్డులో పెద్దవాగు పక్కన చౌడం స్వామి తన పంట చేను వద్ద లేగదూడను కట్టేశాడు. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత రాత్రివేళ లేగదూడను చంపేసినట్లు బాధితుడు తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

బైక్ దొంగల అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు బైక్ దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఈ నెల 28న కంఠేశ్వర్ చౌరస్తా వద్ద బైక్ చోరీ చేసిన చంద్రశేఖర్ కాలనీకి చెందిన ముజహీద్, మాజిద్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

గాంధారి: మండలంలోని పోతంగల్ కలాన్ సమీపంలో బుగ్గగండి వద్ద గురువారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు 108 ఈఎంటీ సురేష్ తెలిపారు. చాకలి కవిత, సందీప్ తిప్పారం నుంచి బాన్సువాడ మండలం కోనాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా బుగ్గగండి వద్ద కారు ఢీకొంది. దీంతో ఇద్దరు కింద పడిపోగా గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏ రియా ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సురేష్, పైలట్ నరేష్ తెలిపారు.

ఆటో ఢీకొని హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ఖలీల్‌వాడి: ఆటో ఢీకొనడంతో హెడ్ కానిస్టేబుల్ గాయాలైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. జీజీహెచ్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శశిప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో ఢీకొన్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ రెగ్యులర్ & డిస్టెన్స్ : డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA (4 నెలల్లో పూర్తి) Dr.J.S అకాడమి (ISO 9001:2015 సర్టిఫైడ్) 8886977112. [HA-15420]

COMPUTER EDUCATION
■ గ్రామీణ యువతి యువకులకు ఉచిత వసతితో కూడిన కంప్యూటర్ శిక్షణ మరియు ఉద్యోగ అవకాశం ఆ: 18 & 30 Yrs, SSC పాస్ సం: 90145 69553 [SCA25001329]

WANTED
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు ఫ్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256049]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.